వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభం

కంఠేశ్వర్, ఏప్రిల్ 28 : జిల్లాలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు మే ఒకటి నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడాధికారి ముత్తెన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాల్‌బ్యాడ్మింటన్ (జడ్పీహెచ్ఎస్ -హాసాకొత్తూర్), బేస్‌బాల్ (జడ్పీహెచ్ఎస్-ముచ్కూర్), బాస్కెట్‌బాల్ (వేల్పూర్-మినీ స్టేడియం), హ్యాండ్‌బాల్(ఎన్జీఎస్-దాస్‌నగర్, మాక్లూర్), హాకీ (జడ్పీహెచ్ఎస్ -జాకోరా), (కబడ్డీ -జడ్పీహెచ్ఎస్- చీమన్‌పల్లి, సిరికొండ), ఖోఖో (జడ్పీహెచ్ఎస్-తాడెం, మోపాల్), నెట్‌బాల్ (జడ్పీహెచ్ఎస్-తాడ్‌బిలోలి), సాఫ్ట్‌బాల్ (జడ్పీహెచ్ఎస్-తొర్లికొండ), వాలీబాల్ (జడ్పీహెచ్ఎస్ -కలిగోట్)లో శిబిరాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'పహల్గాం' ఘటనకు నిరసనగా ధర్పల్లిలో బంద్

ధర్పల్లిలో మూసి ఉన్న దుకాణాలు

ధర్పల్లి, ఏప్రిల్ 28 : కశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల ఉగ్రవాదులు చేసిన దాడికి నిరసనగా మండల కేంద్రంలో సోమవారం బంద్ నిర్వహించారు. పార్టీలకతీతంగా అందరూ బంద్‌లో పాల్గొన్నారు. వ్యాపారులు, దుకాణాదారులు స్వచ్ఛందంగా షాపులు మూసివేసి, నిరసన తెలిపారు. బంద్‌తో ధర్పల్లిలోని ప్రధాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. కార్యక్రమంలో గంగారెడ్డి, నర్సయ్య, బాలయ్య, హమీద్, నూరుద్దీన్, రామకృష్ణ, ప్రశాంత్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సారంగాపూర్, ఏప్రిల్ 28 : రూరల్ మండలంలోని మల్లారం, ధర్మారం, గాంధీనగర్ తండా, మల్కాపూర్ తండా, కొత్తపేట, లింగి తండాలో రూరల్ ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

టీజీవో సభ్యత్వ నమోదు

ఖిల్లీవాడి, ఏప్రిల్ 28 : జిల్లాకేంద్రంలోని మెడికల్ కళాశాలలో టీజీవో అసోసియేషన్ అధ్యక్షుడు అలుక కిషన్, కార్యదర్శి సంఘం అమృత్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెడికల్ కళాశాలలలో సాధారణ బదిలీలు చేపట్టాలని, కొత్తగా ఏర్పడిన మెడికల్ కళాశాలల్లో తక్షణమే నియామక ప్రక్రియ ప్రారంభించాలని అన్నారు. కార్యక్రమంలో వైద్యులు తిరుపతి రావు, దేవీసింగ్, రాములు, నాగమోహన్, స్వామి, జగదీశ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పొతంగల్, ఏప్రిల్ 28 : అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను పోలీసులు సోమవారం పట్టుకున్నారు. మండలంలోని కొడిచర్ల మంజీరా నది శివారు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని, పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

'ప్రజావాణి'కి 114 ఫిర్యాదులు

ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు

కంఠేశ్వర్, ఏప్రిల్ 28 : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 114 ఫిర్యాదులు వచ్చాయని అదనపు కలెక్టర్ అంకిత్ తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్‌తో పాటు నిజామాబాద్ ఇన్‌చార్జి ఆర్డీవో స్రవంతి, మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామ బహిష్కరణ చేశారని ఫిర్యాదు

తమను గ్రామ బహిష్కరణ చేశారని ఆలూర్ మండలం దేగాం గ్రామంలోని రజక కులానికి చెందిన ఆరు కుటుంబాలు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఏడు నెలల నుంచి వీడీసీ సభ్యులు గ్రామ బహిష్కరణ చేశారని, తమ పొలాల్లో వ్యవసాయానికి కావాల్సిన ట్రాక్టర్లు, వ్యవసాయ కూలీలను పని చేయడానికి రానివ్వడం లేదని, కిరాణా దుకాణాలకు వెళ్లినా సామగ్రి ఇవ్వడం లేదని పేర్కొన్నారు. తమతో గ్రామస్తులు మాట్లాడినా, సామగ్రి ఇచ్చినా వారిపై చర్యలు తీసుకుంటామని వీడీసీ సభ్యులు బెదిరిస్తున్నారని తెలిపారు. గ్రామ బహిష్కరణ చేయడంతో తాము మనోవేదనకు గురవుతున్నాయని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రజక కులస్తులు భోజన్న, సందీప్, పద్మ, సునీత, అంకిత పాల్గొన్నారు.

ఒక్కరూపాయి కూడా రుణమాఫీ కాలేదు

- ఫిర్యాదు చేసిన రైతు

ఫిర్యాదు చేసేందుకు వచ్చిన కృపయ్య

డిచ్‌పల్లి మండలంలోని మెంట్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన రైతు కృపయ్య రుణమాఫీ చేయాలని, రైతు భరోసా ఇవ్వాలని ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. తనకు 3 ఎకరాల 2 గుంటల వ్యవసాయ భూమి ఉన్నదని, గతంలో క్రమంగా రైతు బంధు వచ్చేదని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో రైతు భరోసా రావడం లేదని, ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీలో తన పేరిట ఉన్న లక్షా 20 వేల రూపాయల రుణంలో ఒక్క రూపాయి కూడా రుణమాఫీ కాలేదని వాపోయాడు. అధికారులు స్పందించి తనకు రుణమాఫీ అయ్యేలా చూడాలని, రైతు భరోసా అందించాలని కోరాడు.

తాగునీటి సమస్య పరిష్కారం

మరమ్మతు పనులు చేయిస్తున్న అధికారులు

రుద్రూర్, ఏప్రిల్ 28 : కొన్ని రోజులుగా తాగునీరు రావడం లేదని రామాలయం కాలనీవాసులు ఆదివారం నిరసనకు దిగారు. దీంతో స్పందించిన మిషన్ భగీరథ డీఈ మున్నీనాయక్, ఏఈ అజయ్ దగ్గరుండి మరమ్మతు పనులు చేయించి, తాగు నీటి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీల్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు

ఖిల్లీవాడి, ఏప్రిల్ 28 : వరంగల్‌లో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం చేసిన వారికి బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు అభిలాశ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాకేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో సభకు తరలివచ్చిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

చలివేంద్రాలు ప్రారంభం

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి

వినాయక్‌నగర్/ కంఠేశ్వర్/ పొతంగల్, రుద్రూర్, ఏప్రిల్ 28 : జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఫ్యామిలీ కోర్టు జడ్జి ఆశలత, రెండో అదనపు జిల్లా కోర్టు జడ్జి శ్రీనివాస్, న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఉదయ్‌భాస్కర్, జూనియర్ సివిల్ జడ్జి గోపీకృష్ణ, మెజిస్ట్రేట్‌లు కుష్బూ ఉపాధ్యాయ, శ్రీనివాస్‌రావు, హరికుమార్‌తోపాటు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సాయారెడ్డి, ప్రధానకార్యదర్శి మాణిక్ రాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలోని గాయత్రీనగర్ చౌరస్తా వద్ద చలివేంద్రాన్ని వాసవీ క్లబ్ -ఇందూర్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. కారక్రమంలో వాసవీ క్లబ్ ఇందూర్ అధ్యక్షుడు డాక్టర్ గందె శ్రీనివాస్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి నేతి సంతోష్‌గుప్తా, కోశాధికారి లాభిశెట్టి ఓంరాజు గుప్తా, ఉపాధ్యక్షుడు మురికి శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పొతంగల్ మండలకేంద్రంలోని వీక్లీబజార్‌లో పబ్బ లాలప్ప-సాయన్న జ్ఞాపకార్థం గోల్డెన్ జిమ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని సామాజిక సేవాకర్త ఏంఏ హకీమ్ ప్రారంభించారు. కార్యక్రమంలో గోల్డెన్ జిమ్ యజమాని శేఖర్, బీఆర్ఎస్ నాయకులు నవీన్, పీరాజి, జల్లాపల్లి మాజీ ఎంపీటీసీ రాములు, ప్రశాంత్, గంగారాం, రాములు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

'కర్రెగుట్ట నుంచి బలగాలను ఉపసంహరించుకోవాలి'

ఖిల్లీవాడి, ఏప్రిల్ 28 : కర్రెగుట్ట నుంచి పోలీసు బలగాలను ఉపసంహరించాలని, కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరుపాలని కమ్యూనిస్టు పార్టీల నాయకులు అన్నారు. నగరంలోని కోటగల్లీలో ఉన్న నీలం రామచంద్రయ్య భవన్‌లో కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆకుల పాపయ్య, రమేశ్‌బాబు, కృష్ణ, ఓమయ్య, రవీందర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాసి, రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తూ.. దేశ ప్రజలపై యుద్ధం చేస్తున్నదన్నారు. సమావేశంలో నాయకులు వేల్పూర్ భూమయ్య, దాసు, శ్రీనివాస్, సుధాకర్, విఠల్‌గౌడ్, శివకుమార్, మల్లికార్జున్, సత్యం పాల్గొన్నారు.

భద్రత చెక్కు అందజేత

బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న సీపీ సాయిచైతన్య

వినాయక్‌నగర్, ఏప్రిల్ 28 : నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తూ ఐదు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించిన హెడ్ కానిస్టేబుల్ రాథోడ్ ప్రతాప్‌సింగ్ కుటుంబానికి సీపీ సాయిచైతన్య భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్కును సోమవారం అందజేశారు. సదరు హెడ్‌కానిస్టేబుల్ గతేడాది నవంబర్ 27న రోడ్డు ప్రమాదంలో మరణించారు. అతడి పేరుపై వచ్చిన రూ.16లక్షల భద్రతా ఎక్స్‌గేషియా చెక్కును హెచ్‌సీ సతీమణి రాథోడ్ కౌసల్యకు అందజేశారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ రామచంద్రారావు, ఏవో అనీసాబేగం, ఆఫీస్ సూపరింటెండెంట్ వనజ, పోలీస్ సంఘం అధ్యక్షుడు షకీల్ పాషా, డీసీవో సీనియర్ అసిస్టెంట్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

మోపాల్ పోలీస్‌స్టేషన్ తనిఖీ

మోపాల్ (ఖిల్లీవాడి),ఏప్రిల్ 28 : మోపాల్ పోలీస్‌స్టేషన్‌ను సీపీ సాయిచైతన్య సోమవారం తనిఖీ చేశారు. సిబ్బంది పని తీరు, రికార్డులను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, గంజాయి నిర్మూలనకు చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట సీఐ సతీశ్‌కుమార్, ఎస్సై యాదగిరి, సిబ్బంది ఉన్నారు.

పోలీసుల ఫుట్ పెట్రోలింగ్

- పలు ప్రాంతాల్లోడాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు

డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

వినాయక్‌నగర్, ఏప్రిల్ 28 : సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం నగరంలోని టౌ టౌన్, ఫోర్త్ టౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎస్సైలు యాసిర్ అరాఫత్, శ్రీకాంత్ ఆధ్వర్యంలో సివిల్, స్పెషల్ పార్టీ బలగాలు ఫుట్ పెట్రోలింగ్, విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. హైమదీ బజార్, బోధన్ బస్టాండ్ ఏరియాలతో పాటు ఎల్లమ్మగుట్ట, మార్కెట్ ఏరియాలు, అనుమానిత ప్రాంతాలు, హోటళ్లు, లాడ్జిల్లో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

- కాపర్ కాయిల్స్ చోరీ

మోస్రా (చందూర్), ఏప్రిల్ 28 : మోస్రా మండలశివారులో ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని దుండగులు సోమవారం ధ్వంసం చేసి కాపర్ కాయిల్స్‌ను చోరీ చేశారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. మోస్రా శివారులో పొల్లాల్లో ఉన్న 25 కిలోవాట్స్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ ఏఈ గోపికి తెలుపగా.. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఏడేండ్లు కష్టపడితే జీవితాంతం సంతోషమే..

కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో అశోక్

రుద్రూర్, ఏప్రిల్ 28 : విద్యార్థులు ఏడేండ్లు కష్టపడితే జీవితాంతం సుఖమయమైన జీవితం గడపవచ్చని డీఈవో అశోక్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో రైడ్స్‌కమిటీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఉచిత వేసవికాల శిబిరం ఏర్పాటు చేయగా.. ఆయన సోమవారం ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ.. చదువుపై శ్రద్ధ వహిస్తే అనుకున్న విజయాలు సాధిస్తారని సూచించారు. కార్యక్రమంలో రుద్రూర్, వర్ని ఎంఈవోలు శ్రీనివాస్‌రావు, సాయన్న, రైడ్స్‌కమిటీ అధ్యక్షుడు కృష్ణప్రసాద్, సభ్యులు, కస్తూర్బా పాఠశాల ఎస్‌వో శ్యామల తదితరులు పాల్గొన్నారు.

బైపాస్‌రోడ్డులో కారు బీభత్సం

- రోడ్డు పక్కకు దూసుకెళ్లడంతో వ్యాపారి మృతి

వినాయక్‌నగర్, ఏప్రిల్ 28 : నగర శివారులోని బైపాస్‌రోడ్డులో ఓ కారు బీభత్సం సృష్టించింది. రోడ్డు పక్కకు దూసుకెళ్లడంతో వ్యాపారి మృతిచెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రశేఖర్ కాలనీ, జీజీ కళాశాల రోడ్డు పక్కన షేక్ గౌస్ టోపీలు విక్రయిస్తుండగా.. సోమవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి కారును అతివేగంగా నడుపుతూ ఢీకొట్టాడు. ఓ మోపెడ్ వాహనాన్ని సైతం ఢీకొట్టి డ్రైనేజీ గోడను ఢీకొని నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన వ్యాపారి షేక్ గౌస్ దవాఖానకు తరలించగా మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని, ప్రమాదానికి కారణమైన కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించడంతోపాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ప్రహరీ నిర్మాణ విషయంలో ఘర్షణ

- ముగ్గురికి గాయాలు

వినాయక్‌నగర్, ఏప్రిల్ 28 : నగరంలోని రెండోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రహరీ నిర్మాణం విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన గొడవ దాడులకు దారితీసింది. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్సై యాసిర్ అరాఫత్ తెలిపిన వివరాల ప్రకారం.. దారుగల్లీలో అబ్దుల్ మాజిద్ తన ఖాళీ స్థలంలో ప్రహరీ నిర్మించేందుకు పనులు ప్రారంభించాడు. పక్కన ఉండే సయీద్ తమ గోడకు నాలుగు ఫీట్లు వదిలి గోడ నిర్మించుకోవాలని అనడంతో రెండు వర్గాల మధ్య గొడవ జరిగింది. దీంతో రాళ్లతో దాడులు చేసుకోగా మోతేశ్యాం, మోహిద్, ముజాహిద్‌కు గాయాలయ్యాయి. అబ్దుల్ మాజిద్ ఫిర్యాదు మేరకు సయీద్ బిన్‌గానం, అమీద్ బిన్‌గానం, నాసర్, యాసర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అస్సాం రాష్ట్రంలోని పోబిటోరా నేషనల్ పార్కులో ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ తూర్పు రాష్ట్రాల యువ మనోవైద్య మహాసదస్సును సోమవారం నిర్వహించారు. జిల్లాకేంద్రానికి చెందిన ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ విశాల్ ఆకుల సదస్సుకు హాజరై.. పీజీ విద్య పూర్తిచేసిన తర్వాత యువ మనోవైద్యులకు కెరీర్ అవకాశాల అంశంపై ప్రసంగించారు. అనంతరం ఆయనను నిర్వాహకులు సన్మానించారు.

– ఖిల్లీవాడి, ఏప్రిల్ 28

చెరువులో పడి ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్28: ఆలూర్ మండల కేంద్రంలోని ఊర చెరువులో పడి వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఆలూర్ గ్రామానికి చెందిన పుట్ట నవీన్ వారం రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. మూడు రోజుల క్రితం నవీన్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం ఊర చెరువులో మృతదేహం లభ్యమైంది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

బావిలో పడి యువకుడు..

ఎడపల్లి, ఏప్రిల్ 28: మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతి చెందాడు. ఎస్సై వంశీకృష్ణారెడ్డి కథనం ప్రకారం.. మంగళ్‌పాడ్ గ్రామానికి చెందిన మంగళి దేవిదాస్ (28) ఆదివారం సాయంత్రం స్నేహితులతో కలిసి తోళ్ల బావి సమీపంలో మద్యం సేవించాడు. మూత్రవిసర్జనకు వెళ్లి పక్కనే ఉన్న బావిలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. ఈతరాకపోవడంతో మృతి చెందాడు. సోమవారం మధ్యాహ్నం మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ మృతదేహం లభ్యం

ఎడపల్లి, ఏప్రిల్ 28: జాన్కంపేట్ గ్రామంలోని చెరువులో ఓ మహిళ మృతదేహం సోమవారం లభ్యమైంది. ఎస్సై వంశీకృష్ణారెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బోదసు దేవమ్మ(60) ఈనెల 26న సాయంత్రం కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటికి వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం ఉదయం అశోక్ సాగర్ చెరువులో మహిళ మృతదేహం లభ్యమైంది. మృతురాలి కుమారుడు మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

డంపర్లను నియంత్రించాలి

నందిపేట్, ఏప్రిల్ 28: నల్లమట్టి తరలిస్తున్న టిప్పర్లు, డంపర్లను చౌడమ్మ కొండూర్ శివారులో సోమవారం నిలిపివేసి గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండల శివారు గోదావరి ఒడ్డు నుంచి నల్లమట్టిని చౌడమ్మ కొండూర్ మీదుగా టిప్పర్లు, టారస్‌ల ద్వారా తరలిస్తున్నారని, భారీ సంఖ్యలో వాహనాలు ఓవర్ లోడ్‌తో, అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతుండడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఒక్క రోజే రెండు ప్రమాదాలు జరిగాయని అన్నారు. ద్విచక్ర వాహనాన్ని డంపర్ ఢీకొట్టిందని, ఒకరికి చెయ్యి విరిగిందని, చౌడమ్మకొండూర్‌కు చెందిన పశువును టిప్పర్ ఢీకొట్టిందని అన్నారు. టిప్పర్ల రాకపోకలను నియంత్రించాలని డిమాండ్ చేశారు.

ఐదెకరాల్లో ఈతవనం దగ్ధం

బోధన్, ఏప్రిల్ 28: సాలూరా మండలం తగ్గెల్లి శివారులో ఐదెకరాల్లో ఉన్న ఈతవనం సోమవారం దగ్ధమైంది. బోధన్ ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఈతవనంలో చెట్లు కాలిపోయాయి. వాటితో పాటు నీటి పైపులు కూడా పూర్తిగా కాలిపోయాయి. రూ.రెండు లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు అంచనా వేశామని బోధన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. నిర్లక్ష్యంగా పొగతాగడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈతవనాన్ని గీత కార్మికులు పెంచుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

'భూ భారతి'తో సమస్యలు పరిష్కారం

మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ

ఎడపల్లి/రెంజల్, ఏప్రిల్28: భూముల క్రయ విక్రయాల్లో విషయంలో అవకతవకలకు ఆస్కారం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి (ఆర్‌వోఆర్ చట్టం) తీసుకువచ్చిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అన్నారు. ప్రతి రైతుకూ ఆధార్ లాగే భూధార్ నంబర్లను కేటాయించనున్నట్లు తెలిపారు. ఎడపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మెహతోతో కలిసి సోమవారం భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.దన్వాల్, సొసైటీ చైర్మన్లు పోల మల్కారెడ్డి, మిద్దె నరేందర్, ఏవో సిద్ధి రామేశ్వర్, నాయకులు బిల్లా రాంమోహన్, బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు పాల్గొన్నారు.

రెంజల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో భూభారతిపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు హాజరై మాట్లాడారు. సదస్సు ముగిసిన తర్వాత తిరిగి వెళ్తున్న కలెక్టర్‌కు రెంజల్, దూపల్లి గ్రామాల రైతులు సమస్యలను వివరించారు. అర్హులకు రుణమాఫీ వర్తింపజేయాలని విన్నవించారు. రెంజల్‌లో గన్నీ సంచులు, లారీల కొరత ఉందని కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో రఫీయొద్దీన్, ఏవో శ్రీనివాస్‌రావు, మాజీ ఎంపీపీ మోబిన్‌ఖాన్, మాజీ జడ్పీటీసీ నాగభూషణంరెడ్డి, రైతులు పాల్గొనారు.

రైతులకు పసుపు విత్తనాల పంపిణీ

పసుపు విత్తనాన్ని అందజేస్తున్న శాస్త్రవేత్తలు

మోర్తాడ్, ఏప్రిల్ 28: కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన కేంద్రంలో రైతులకు పసుపు విత్తనాలను సోమవారం పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు అందజేశారు. రైతులకు అందజేసిన రకాల్లో దుగ్గిరాల ఎరుపు, రాజేంద్రసోనియా, బీఎస్ ఆర్2, రాజాపూరి, పులే స్వరూప మొదలగు రకాల దాదాపు 40 క్వింటాళ్ల విత్తనాన్ని 35 మంది రైతులకు పంపిణీ చేశారు. పసుపు విత్తనాల కోసం నిజామాబాద్ జిల్లాతో పాటు నిర్మల్, జగిత్యాల, వికారాబాద్ రైతులు తరలి వచ్చారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మహేందర్, భాస్కర్, శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంకెట రవి పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా క్యాండిల్ ర్యాలీలు

చౌట్‌పల్లిలో పహల్గావ్ అమరులకు నివాళులు అర్పిస్తున్న ప్రజలు

మోర్తాడ్/నవీపేట/రెంజల్, ఏప్రిల్ 28: పహల్గాంలో ఉగ్రదాడికి నిరసనగా మోర్తాడ్‌లో, కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి గ్రామంలో సోమవారం రాత్రి యువజన సంఘాలు, పార్టీలకు అతీతంగా క్యాండిల్ ర్యాలీలు నిర్వహించారు. అనంతరం ఉగ్రదాడిలో అమరులైన వారికి నివాళులర్పించారు. నవీపేట మండలంలోని జన్నేపల్లి చౌరస్తాలో మర్చంట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండించారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ నవీపేటలో అఖిల పక్షం ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ విజయవంతమైంది. దుకాణాలు, హోటళ్లు, పెట్రోల్ బంకులు స్వచ్ఛందంగా మూసి ఉంచారు. ఉగ్రదాడిని ఖండిస్తూ రెంజల్‌లో ముస్లింలు తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎస్సై చంద్రమోహన్‌కు వినతిపత్రాలు అందజేశారు.

నవీపేట మండలం జన్నేపల్లి చౌరస్తాలో ..

యూనిఫాం క్లాత్ అందజేత

భీమ్‌గల్, ఏప్రిల్ 28: మండలం కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సోమవారం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో విద్యార్థుల స్కూల్ యూనిఫాంను కుట్టడానికిగా